చేయి చేసుకున్నారు



చిన్నదర్పల్లిలో ఇంటి నిర్మాణం వివాదం కావడంతో నేను అక్కడికి వెళ్లా. అక్కడికి వచ్చిన కమిషనర్ అందరి ముందు నను దూషించారు. ఛాంబర్‌కు వచ్చాక ఆ భూమికి సంబంధించిన దస్త్రాలు అడిగారు. దస్త్రాలు నా వెంట లేవని చెప్పగా నాపై చేయిచేసుకున్నారు.

- వెంకటేశ్‌గౌడ్, జవాన్

కొట్టడానికి కుర్చీ ఎత్తారు



నాకు కేటాయించిన వార్డులో రూ.1.50 లక్షల ఇంటి పన్నులు వసూలు చేశా. అయినా నన్ను ఇష్టానుసారంగా దూషిస్తూ, కొట్టడానికి కుర్చీ ఎత్తారు. బంధువులకు ఆరోగ్యం బాగాలేదని సెలవు అడిగినా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేశారు.

- కృష్ణయ్య, బిల్ కలెక్టర్

ముందస్తుగా గుర్తించడంలో..
వెనుకడుగు





రోగులు లేని లెప్రసి వార్డు

- పాలమూరులో రోజు రోజుకు విస్తరిస్తున్న కుష్టు వ్యాధి
- ఏడాదిలో 68 కొత్త కేసులు నమోదు
- ప్రత్యేక కార్యక్రమాల్లోనే వ్యాధిగ్రస్తుల గుర్తింపు
- ప్రత్యేక వార్డు ఉన్నా లేని రోగులు
- దృష్టి సారించని వైద్య ఆరోగ్యశాఖ



కుష్టు వ్యాధి లక్షణాలు

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కొన్ని వ్యాధులను ముందస్తుగా గుర్తిస్తే.. వాటిని నివారించేందుకు అవకాశం ఉంటుంది. కానీ మహబూబ్‌నగర్ జిల్లాలో అలా గుర్తించడంలో కుష్టు నియంత్రణ విభాగం అధికారులు వెనుకడుగు వేస్తున్నారు. దీంతో వ్యాధి రోజు రోజుకు విస్తరిస్తోంది. వయసుతో నిమిత్తం లేకుండా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తోంది. ప్రస్తుతం జిల్లాలో గత ఏడాది 68 కొత్త కేసులు నమోదయ్యాయి. వైద్య సిబ్బంది దినచర్యలో భాగంగా ఇంటింటి సర్వేలో ఈ వ్యాధిగ్రస్తులను గుర్తించాల్సి ఉండగా, ప్రత్యేక కార్యక్రమంలోనే సర్వే అంటూ హడావుడి చేస్తున్నారు. కుష్టు రోగులకు చికిత్స అందించే వార్డు ఉన్నప్పటికీ.. అందులో రోగులు లేకపోవడం విడ్డూరంగా అనిపిస్తోంది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఈ వ్యాధిపై దృష్టి సారించకపోవడంతోనే కేసులు పెరుగుతున్నాయని చెప్పొచ్చు.

సిబ్బంది లేక..

ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు రోజూ వివిధ కార్యక్రమాల్లో భాగంగా ఇంటింటికి తిరుగుతుంటారు. అదే క్రమంలో మలేరియా, డెంగీ, టీబీతో పాటు కుష్టు రోగులను కూడా గుర్తించాలని మార్గదర్శకాలు ఉన్నాయి. కానీ దానిని గుర్తించడంలో మాత్రం వెనుకడుగు వేస్తున్నారు. వాస్తవానికి ఈ విభాగానికి సంబంధించి ఇద్దరు ప్రోగ్రాం ఆఫీసర్లు, ఒక డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ మాత్రమే ఉన్నారు. గతంలో ఈ విభాగంలో సిబ్బంది సరిపోయినంత మంది ఉండేవారు. దీంతో ఆ విభాగంపై పర్యవేక్షణ కూడా ఉండేది. కేసులు కూడా ఎక్కువగానే గుర్తించేవారు. ప్రస్తుతం సిబ్బంది లేకపోవడంతో కేసుల గుర్తింపు ప్రక్రియ మందకొడిగా సాగుతోంది.

విస్తరిస్తున్న వ్యాధి

జిల్లాలో కుష్టు వ్యాధి రోజు రోజుకు విస్తరిస్తోంది. గత ఏడాది 2024 జనవరి నుంచి డిసెంబరు వరకు 68 కొత్త కేసులు నమోదయ్యాయి. అందులో నలుగురు పిల్లలు కాగా, 43 మంది పురుషులు, 28 మంది స్త్రీలు ఉన్నారు. 68 కేసుల్లో 54 మంది చికిత్స తీసుకుంటున్నారు. మరో 14 మంది నయం అయ్యి చికిత్స బంద్ చేశారు. 2023లో 49 కేసులను గుర్తించారు. అందులో ఒకరిద్దరు మినహాయించి అందరు ట్రీట్‌మెంట్ తీసుకొని వ్యాధిని నయం చేసుకున్నారు.

ప్రత్యేక కార్యక్రమాల్లోనే గుర్తింపు..

ప్రతీ ఏడాది గాంధి వర్ధంతి రోజున కుష్టు వ్యాధి నిర్మూలన అవగాహన ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. అందులో భాగంగానే సర్వే చేసి, రోగులను గుర్తిస్తారు. ఆ ప్రకారం గత ఏడాది మార్చిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి, 21 కేసులు గుర్తించారు. అదే విధంగా గత ఏడాది డిసెంబరు నాలుగు నుంచి 24 వరకు ఏడు, ఈ ఏడాది జనవరి రెండు నుంచి 25 వరకు రెండు కేసులు గుర్తించారు. ఇలా ఏదైనా ప్రత్యేక కార్యక్రమం ఉంటే తప్ప.. దీని గురించి ఆలోచించని దుస్థితి నెలకొంది.



ప్రత్యేక కార్యక్రమంలో ఇంటింటి సర్వే చేస్తున్న అధికారులు(ఫైల్)

రోగులు లేని వార్డు..

కుష్టు రోగులకు సేవలందించేందుకు 1980లో జనరల్ ఆస్పత్రి ఆవరణలో టెంపరరీ హాస్పిటలైజేషన్ వార్డు పేరుతో ఒక వార్డును ఏర్పాటు చేశారు. అందులో మెడికల్ ఆఫీసర్‌తో పాటు ల్యాబ్ టెక్నీషియన్లు, ఫిజియోథెరపిస్టులు, స్టాఫ్ నర్సుల పోస్టులు మంజూరయ్యాయి. కానీ ఆ వార్డు శిథిలావస్థకు చేరింది. గాయాలతో ఉండే రోగులు తగ్గిపోయారు. డ్రెస్సింగ్‌లు కూడా చేయడం లేదు. కానీ రోగులు లేకపోయినా ఆ వార్డును ఇంకా కొనసాగిస్తున్నారు. ఆ వార్డులో సగభాగాన్ని 108 అంబులెన్సు సర్వీసులకు కూడా ఇచ్చేశారు. ఆయా పోస్టులకు డిప్యుటేషన్ తీసుకొని, విధులకు రావడం లేదు. అంతేకాకుండా ఆ పోస్టులు చూపించి.. వేరే వద్దకు డిప్యుటేషన్ వేయించుకుంటున్నారు. ఇదంతా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు తెలిసినప్పటికీ ఏమీ చేయడం లేదు. ఆ వార్డును తొలగించాలని ఆదేశాలు వచ్చినప్పటికీ తీయకుండా, ఆ పోస్టులను కాపాడుకుంటున్నారు. ఇప్పటికైనా కుష్టు వ్యాధి నిర్మూలనపై అధికారులు దృష్టి సారిస్తే బాగుంటుంది.



కార్పొరేషన్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సిబ్బంది, కార్మికులు

తీరు మారకుంటే..
సమ్మెకు దిగుతాం

- చేయి చేసుకోవడంతో పాటు పరుషపదజాలంతో దూషిస్తున్నారు
- పాలమూరు కార్పొరేషన్ కమిషనర్ తీరుపై సిబ్బంది ఆగ్రహం

మహబూబ్‌నగర్/పాలమూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పాలమూరు కార్పొరేషన్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి తీరును నిరసిస్తూ సిబ్బంది శనివారం ఆయన చాంబర్ ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నాకు దిగారు. ఇప్పటికే ఆయనపై పలుమార్లు ఆరోపణలు వచ్చినా నాయకులు సర్దిచెబుతూ వచ్చారు. అయినా ఆయనలో మార్పు రాలేదని తమను ఇష్టానుసారంగా దూషించడంతోపాటు చేయి కూడా చేసుకున్నారని కార్మికులు, జవాన్‌లు తెలిపారు. ఆయన తిట్ల పురాణాన్ని ఫోన్‌లలో రికార్డ్ చేసుకున్నామని పలువురు చెప్పారు. చిన్నదర్పల్లిలో ఓ వ్యక్తి పొలం ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతుండటంతో టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసు జారీ చేశారు. అయినా ఇంటి నిర్మాణం చేపడుతుండటంతో మునిసిపల్ సిబ్బంది వెళ్లి సామాను లాక్కొచ్చారు. అతను కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో కమిషనర్ స్పాట్‌కు సిబ్బందిని పంపించారు. అక్కడికి వెళ్లిన కమిషనర్.. ఓ జవాన్‌ను అందరి ముందు ఇష్టానుసారంగా తిట్టడంతోపాటు కొట్టినంత పని చేశారు. ఆయన మునిసిపల్ కమిషనర్‌లా కాకుండా పోలీస్ కమిషనర్‌నని అనుకుంటున్నారని మండిపడ్డారు. కార్మికులంటే కమిషనర్‌కు చిన్న చూపు ఉందని, ఆయన పద్ధతి మార్చుకోకపోతే సమ్మెకు దిగుతామని మునిసిపల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ అన్నారు. కార్మికులను అసభ్యంగా పరుషపదజాలంతో దూషించడం, అవమానకరంగా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, మునిసిపల్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల వెంకటేశ్, ఎర్ర నర్సింహులు మాట్లాడుతూ మునిసిపల్ చరిత్రలో ఎప్పుడూ జరగని దారుణాలు కార్మికులు చూస్తున్నారన్నారు. తీరు మార్చుకోకపోతే కార్పొరేషన్ పరిధిలో ఉన్న 820 మంది కార్మికులం విధులు బహిష్కరించి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కమిషనర్ లేకపోవడంతో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు చంద్రకాంత్, రాజ్‌కుమార్, వరదగాలన్న, ప్రభాకర్, బాలరాజు, తిరుపతయ్య, చందు పాల్గొన్నారు.

వీధిలైట్లు పడకపోతే తిడతారు



పట్టణంలో కొన్ని ప్రాంతాల్లో వీధిలైట్లు పడకపోతే ఫోన్ చేసి ఏం పీకుతున్నారంటూ ఇష్టానుసారంగా తిడతారు. రాత్రి తొమ్మిది తరువాత మీటింగ్ అంటూ పిలిచి తిడతారు.

- ఉదయ్‌కుమార్, ఎలక్ట్రీషియన్

క్రీడల్
- సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్‌కు మోక్షం ఎప్పుడో?
- ఏర్పాటైతే అథ్లెట్లకు మెరుగైన శిక్షణకు అవకాశం
- వర్షం పడితే ట్రాక్ జలమయం
- పీయూలో అందుబాటులోకి వచ్చిన అధునాతన ట్రాక్

7

కలెక్టరేట్‌లో పాముల కలకలం
- మొక్కల మధ్య రెండు రక్త పింజరి పాముల గుర్తింపు
- పట్టుకుని బుద్ధారం గండిలో వదిలేసిన స్నేక్‌క్యాచర్ తెప్ప వంశీ

7

రూ.1.31 కోట్లు విడుదల

- సమగ్ర కుటుంబ సర్వే డబ్బులు మంజూరు
- ఎన్యుమరేటర్లకు రూ.10 వేలు, సూపర్‌వైజర్లకు రూ.12 వేలు
- డాటా ఎంట్రీ ఆపరేటర్లకు విడుదల కాని డబ్బులు



మద్దూర్‌లో సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్‌లో నమోదును పరిశీలిస్తున్న సీపీవో యోగానంద్ (ఫైల్)

నారాయణపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే చేసిన ఎన్యుమరేటర్స్, సూపర్‌వైజర్లకు ప్రభుత్వం రూ.1.31 కోట్లు విడుదల చేసింది. అయితే ఇంకా డేటా ఎంట్రీ ఆపరేటర్లు విడుదల కాలేదు. జిల్లాలో 1,172 మంది ఎన్యుమరేటర్లు సర్వేలో పాల్గొనగా.. రూ.10 వేల చొప్పున రూ.1,13,20,000, 116 మంది సూపర్‌వైజర్లకు రూ.12 వేల చొప్పున రూ.13,92,100 అందించనున్నారు. వాటిని ఎంపీడీవోల ఖాతాల్లో జమ చేయగా.. ఎన్యుమరేటర్స్, సూపర్‌వైజర్ల ఖాతాల్లో వేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,61,214 నివాసాలకు సంబంధించి సర్వేలో సేకరించిన వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చేందుకు డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ప్రభుత్వం ఇంకా నిధులు విడుదల చేయాల్సి ఉంది. ప్రైవేట్ ఆపరేటర్స్ 1,276 మంది 1,59,544 దరఖాస్తులను ఎంట్రీ చేయగా, ఒక్కో దరఖాస్తు క్రోడీకరణకు రూ.30 చొప్పున రూ.47,86,320, ప్రభుత్వ ఆపరేటర్లు 52 మందికి ఒక్కో దరఖాస్తుకు రూ.14 ప్రకారం రూ.23,380 రూ.48,09,700 నిధులు అవసరమని అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. ఆ డబ్బులు వెంటనే విడుదల చేయాలని ఆపరేటర్లు కోరుతున్నారు.

భర్తను కొట్టి చంపిన భార్య

- మద్యం తాగి వేధిస్తున్నాడని అఘాయిత్యం

భూత్పూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రతీరోజు మద్యం తాగి వచ్చి ఇంట్లో గొడవ చేస్తూ తనను తరచూ కొడుతున్నాడని ఓ ఇల్లాలు తన భర్తను ఇంట్లో ఎవరూ లేని సమయంలో కంట్లో కారం పొడి చల్లి తలపై రోకలి బండతో మోది హత్య చేసింది. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండలంలోని తాటికొండ గ్రామంలో చోటు చేసుకున్నది. భూత్పూర్ పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తాటికొండ గ్రామానికి చెందిన కొమ్ము మల్లేష్ (40), అతని భార్య కొమ్ము మాసమ్మ గొర్రెల కాపరులు. కొమ్ము మల్లేష్‌కు మద్యంతాగే అలవాటు ఉన్నది. ఆయన ఇంటి దగ్గర ఉంటూ పనీపాట లేకుండా ఖాళీగా ఉండేవాడు. ఈ సమయంలో మద్యానికి బానిసగా మారాడు. ఇంట్లో భార్యతో తరచూ గొడవపడుతుండేవాడు. ఈ క్రమంలో ఈ నెల 7వ తేదీ సాయంత్రం మద్యంతాగి ఇంటికి వచ్చిన మల్లేష్ తన భార్య కొమ్ము మాసమ్మతో గొడవపడ్డాడు. తాగిన మైకంలో భర్త తనను చాలాకాలంగా వేధిస్తున్నాడని, ఇక ఈ బాధ భరించలేనని భార్య నిర్ణయించుకున్నది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో అదేరోజు రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో భర్త మల్లేష్ కంట్లో కారంపొడి చల్లింది. ఇంట్లోని మూలన ఉన్న రోకలిబండతో తలపై మోది హత్య చేసింది. విషయాన్ని మృతుని కుమారుడైన కొమ్ము నరేష్ తన చిన్నాన్న అయిన కొమ్ము లక్ష్మణ్‌కు ఫోన్ ద్వారా తెలిపారు. అయితే ఆయన వృత్తిపరంగా గొర్రెలను మేపుకోవడానికి సంగారెడ్డి జిల్లా ప్రాంతానికి వెళ్లాడు. ఇంటికి వచ్చిన ఆయన శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

3,99,048

- నారాయణపేట జిల్లాలోని ఓటర్ల సంఖ్య ఇది
- పంచాయతీ సప్లిమెంటరీ ఓటర్ జాబితా విడుదల



కొత్తపల్లి పంచాయతీ కార్యాలయం

నారాయణపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో 276 గ్రామ పంచాయతీలకు గాను 3,99,048 మంది ఓటర్లు ఉన్నారు. ఈ మేరకు ఈ నెల ఆరో తేదీన పంచాయతీ ఓటర్ల జాబితా సప్లిమెంటరీని ప్రదర్శించారు. వారిలో పురుషులు 1,95,475 మంది, మహిళలు 2,03,569 మంది, ఇతరులు నలుగురు ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు 8,094 మంది అధికంగా ఉన్నారు. జిల్లాలో 280 గ్రామ పంచాయతీలు ఉండేవి. మద్దూర్ మునిసిపాలిటీగా ఆవిర్భవించడంతో మద్దూర్, రెనివట్ల పంచాయతీలు మునిసిపాలిటీల్లో విలీనం అయ్యాయి. వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండలంలో హకీంపేట్, పోలేపల్లిలు కలువడంతో నాలుగు పంచాయతీలు తగ్గి, 276కు చేరాయి. కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీ అధికారి కృష్ణ పంచాయతీ పోరుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- ఈవీఎం గోదాముల పరిశీలనలో కలెక్టర్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన ఈవీఎం గోదామ్ వద్ద భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతీ నెల ఈవీఎంలు భద్రపరిచిన గోదాముల తనిఖీలో భాగంగా శనివారం పాత కలెక్టరేట్ ఆవరణలోని గోదామును, కొత్త కలెక్టరేట్ ఆవరణలోని గోదామును తనిఖీ చేశారు. గదుల సీల్‌లను తనిఖీ చేశారు. భద్రతా సిబ్బంది హాజరు, పోలీసు బందోబస్తును పరిశీలించారు. కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి కేవీవీ రవికుమార్, ఎన్నికల విభాగం డీటీ జాఫర్, తదితరలు ఉన్నారు.



పాత కలెక్టరేట్ ఆవరణలో ఈవీఎంలు ఉన్న గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

పల్లె పోరుకు సన్నద్ధం

- 290 మంది ఆర్వో, ఏఆర్వోల నియామకం
- 490 మంది స్టేజ్-2 అధికారులు కూడా..
- 11, 12 తేదీల్లో ఎన్నికల నియమావళిపై శిక్షణ


చెన్నంగుల గడ్డ గ్రామ పంచాయతీ కార్యాలయం

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : పల్లె పోరుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. గత నెలలో ముసాయిదా ఓటరు జాబితాను పోలింగ్ కేంద్రాల్లో ప్రదర్శించి ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించారు. బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్ తుది దశకు చేరకుంది. ఎన్నికల నోడల్ అధికారులుగా 12 మంది జిల్లా స్థాయి అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయేందిర బోయి నియమించారు. పంచాయతీరాజ్ కార్యదర్శి అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు శనివారం ఎన్నికల నిర్వహణ కోసం 290 మంది అధికారులను ఆర్వోలుగా, 490 మందిని స్టేజ్-2 అధికారులుగా నియమించారు. వీరికి ఈనెల 11, 12 తేదీల్లో ఎన్నికల నియామవళిపై ఒక రోజు శిక్షణను ఇవ్వనున్నారు. వీరితో పాటు అదనపు పోలింగ్ అధికారులను, సహాయ పోలింగ్ అధికారులను నియమించనున్నారు. జిల్లాలో నూతనంగా ఏర్పడిన మండలాలైన కౌకుంట్ల, మహమ్మదాబాద్‌తో కలిపి 16 మండలాలు ఉన్నాయి. వాటిలో హన్వాడ, గండీడ్, చిన్నచింతకుంట, దేవరకద్ర, కోయిల్‌కొండ, నవాబ్‌పేట, కౌకుంట్ల, మహమ్మదాబాద్ మండలాలకు 11న సోమవారం జిల్లా కేంద్రంలోని సమావేశ మందిరంలో శిక్షణ ఇవ్వనున్నారు. 12న మంగళవారం అడ్డాకుల, మూసాపేట, భూత్పూర్, బాలానగర్, రాజాపూర్, జడ్చర్ల, మిడ్జిల్, మహబూబ్‌నగర్ మండలాలకు కేటాయించిన అధికారులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణ కార్యక్రమం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయేందిర బోయి ఆధ్వర్యంలో కొనసాగనుంది. నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని డీపీవో పార్థసారథి తెలిపారు. 3,674 పోలింగ్ కేంద్రాలకు గాను 3,674 మంది పోలింగ్ అధికారుల అవసరం ఉండగా, వారిని కూడా త్వరలోనే నియమిస్తామన్నారు.

ఇందిరమ్మ నమూనా
ఇంటి నిర్మాణానికి భూమి పూజ


ఇంటి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న అధికారులు

మాగనూరు/ మక్తల్ రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమంలో భాగం గా శనివారం మాగనూరు మండల కేం ద్రంలోని కాంప్లె క్స్ ఆవరణలో ఇందిరమ్మ న మూనా ఇంటి నిర్మాణానికి అధికారులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా హౌసింగ్ పీడీ జి.శంకర్, డీఈ హరికృష్ణ మాట్లాడుతూ లబ్ధిదా రులకు అవగాహన కల్పించడం కోసం నమూ నా ఇంటి నిర్మాణం చేపడుతున్నామన్నారు. త హసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీవో రహమతు ద్దీన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, మక్తల్ మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలప్ప తదితరులున్నారు. అదేవిధంగా, మక్తల్ పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మా ణానికి అధికారులు భూమి పూజ చేశారు. కాం గ్రెస్ పట్టణ అధ్యక్షుడు రవికుమార్, గడ్డం రమేష్ తదితరులున్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి
విగ్రహ ప్రతిష్ఠ


ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

నారాయణపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, కర్ణాటక సరిహద్దు గుర్మిట్కల్ నియోజకవర్గ పరిధిలోని పాడుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం అంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు వైభవోపేతంగా జరిగాయి. బ్రాహ్మణుల వేదమంత్రోచ్చరణాల మధ్య జల, ధ్యాన్యాది వాసాలతో పాటు నవగ్రహాల పతిష్ఠ, నాగదేవతల పతిష్ఠ అనంతరం గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ నిర్వహించారు. ఆలయం ముందు ధ్వజస్తంభ ప్రతిష్ఠను క్రేన్ సహాయంతో భక్తజన సందోహం మధ్య ప్రతిష్ఠించారు. ఏలేరి పీఠాధిపతి కొట్రయ్యస్వామి హాజరయ్యారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలను నిర్వాహకులు సత్కరించారు. బలిచక్రం వేదమూర్తి మనయ్యస్వామి, గ్రామస్థులు పాల్గొన్నారు.


బొడ్రాయిని ప్రతిష్ఠిస్తున్న పూజారులు


పూజలు చేస్తున్న భక్తులు

భూసర్వే అధికారులను అడ్డుకున్న రైతులు


భూ సర్వే అధికారులను అడ్డుకుంటున్న రైతులు

మక్తల్ రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మం డలం కాట్రవల్లి గ్రామ శివా రులో నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా శనివారం సర్వే చేయడానికి వచ్చిన అధికా రులను రైతులు అడ్డుకున్నారు. తమకు ఎలాంటి సమా చారం ఇవ్వకుండా ఎందుకు సర్వే చేస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. సర్వే ఆపాలని అడ్డుకోవడంతో అధికారులు వెనుతిరిగి వెళ్లిపోయారు. రైతులు రాజు, అశోక్, శ్రీనివాసులు, నారాయణ తదితరులున్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి : ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : నూతన చట్టాల ప్రకారం కేసుల దర్యాప్తు, వి చారణలో పాటించాల్సిన విధానాలపై సిబ్బంది నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకు సంపూ ర్ణ అవగాహన ఉండాలని ఎస్పీ జానకి అన్నారు. కొత్త చట్టాల ద్వారా కేసుల విచారణ వేగంగా పూర్తవుతుందని, న్యాయ వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుందన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీస్ అధికారులకు నూతన న్యాయ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. తెలంగాణ రాష్ట్ర పోలీసు లీగల్ అడ్వైజర్ అండ్ రిటైర్డ్ పీపీ రాములు ద్వారా నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. అమలులోకి వచ్చిన భారత న్యాయ నియమావళి, భారత సాక్ష్య నిబంధన, భారత న్యాయపరమైన భద్రతా నిబంధన గురించి వివరించారు. డిజిటల్ నేరాలు, మహిళల భద్రత, పిల్లల రక్షణ, సైబర్ నేరాలపై కొత్త చట్టాలు ఎలా సహాయపడతా యో వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో శాంతిభద్రతలు కాపాడటంలో నూతన చట్టాల పాత్ర కీలకం అన్నారు. అనంతరం ఎస్పీ రాములును శాలువా మెమెంటోతో సత్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాములు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్బీ డీఎ స్పీ రమణారెడ్డి, డీటీసీ డీఎస్పీ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

30 ట్రాక్టర్ల ఇసుక డంపులు సీజ్

- కోయిలకొండ మండలం సూరారం వాగులో గుర్తింపు

కోయిలకొండ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సూరారం వాగులో శనివారం రాత్రి ఆర్ఐలు బురాన్, శంకర్ బృందం నిర్వహించిన దాడుల్లో 30 ట్రాక్టర్ల ఇసుక డంపులు గుర్తించి, సీజ్ చేశారు. కొన్ని రోజుల నుంచి ఇసుక అక్రమ రవాణా నిర్వహిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో అధికారులు దాడులు నిర్వహించారు. సురారం పరిధిలో అనుమతులు లేకుండా ట్రాక్టర్లతో ఇసుక డంపులు వేసి లారీల్లో ఇసుకను తరలిస్తున్నారు. ఈ విషయం బయటకు పొక్కడంతో అధికారులు తనిఖీ చేపట్టి, సీజ్ చేసిన 30 ట్రాక్టర్ల ఇసుకను రెవెన్యూ అధికారులు పోలీసులకు అప్పగించారు.

ఇంటర్ రెండో విడత
ప్రయోగ పరీక్షలు ప్రారంభం


గద్వాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండో విడత ప్రయోగ పరీక్షలను పరిశీలిస్తున్న డీఐఈవో హృదయరాజు

గద్వాల సర్కిల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ రెండో విడత జనరల్, వృత్తి విద్య ప్రయోగ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాలను డీఐఈవో, పరీక్షల జిల్లా కన్వీనర్ హృదయరాజు తనిఖీ చేశారు. ఉదయం జనరల్ ప్రయోగ పరీక్షకు 308 మందికి గాను 301, వృత్తి విద్య ప్రయోగ పరీక్షలకు 130 మందికి గాను 125 మంది విద్యార్థులు హాజరైనట్లు డీఐఈవో తెలిపారు. మధ్యాహ్నం జనరల్ ప్రయోగ పరీక్షకు 123 మంది, వృత్తి విద్యా ప్రయోగ పరీక్షకు 240 మందికి 232 మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. గద్వాలలోని ప్రభుత్వ, శ్రీకృష్ణవేణి, ధరూర్‌లోని ప్రభుత్వ, మల్దకల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జరిగిన ప్రయోగ పరీక్షలను డీఐఈవో పరిశీలించారు.

ఐదుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు


డ్రంకెన్‌డ్రైవ్ టెస్టు చేస్తున్న మల్దకల్ ఎస్ఐ నందీకర్, సిబ్బంది

గద్వాల క్రైం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలను నడిపితే చర్యలు తప్పవని మల్దకల్ ఎస్ఐ నందీకర్ హెచ్చరించారు. శనివారం రాత్రి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష నిర్వహించారు. ఇందులో మద్యం తాగి వాహనాలను నడిపిన ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. పోలీస్ సిబ్బంది ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లోనే మహిళ ప్రసవం

వెల్దండ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అంబులెన్స్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో ఓ మహిళ అంబులెన్స్‌లోనే ప్రసవించిన సంఘటన వెల్దండ మండలంలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని అజిలాపూర్ గ్రామానికి చెందిన మమత శనివారం పురుటి నొప్పులతో బాధపడుతుండగా ఆమెను భర్త శంకర్ కారులో ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో నొప్పులు అధికం కావడంతో ఆందోళన చెందిన శంకర్ 108 అంబులెన్స్‌కు సమాచారం అందించాడు. దీంతో అంబులెన్స్ వాహనం వెల్దండ సమీపంలో వారి వద్దకు చేరుకున్నాది. కాగా, మమత ప్రసవం కోసం ఇబ్బంది పడుతుండడంతో బిడ్డకు ఎటువంటి ప్రమాదం జరగకూడదని భావించిన అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ గణేష్, పైలట్ ఇమ్రాన్‌లు చాకచక్యంగా వ్యవహరించి అంబులెన్స్‌లోనే ప్రసవం చేశారు. అక్కడి నుంచి తల్లీ, కొడుకును కల్వకుర్తి ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు అంబులెన్స్ సిబ్బందిని మండల ప్రజలు ప్రశంసించారు.

సులువుగా మొక్కజొన్న సాగు..

- యాసంగిలో గణనీయంగా పెరిగిన మొక్కజొన్న
- వేరుశనగ, వరికి చీడపీడల బెడదతో విసిగిన రైతు
- నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 26,590 ఎకరాల్లో సాగు

తాడూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : కొన్నేళ్ల క్రితం రబీలో అత్యధికంగా వేరుశనగ, వడ్లు వంటి పంటలు మాత్రమే గణనీయంగా సాగయ్యేవి. ప్రస్తుత పరిస్థితుల్లో వరి, వేరుశనగ పంటలకు వాతావరణ మార్పుల కారణంగా వివిధ రకాల తెగుళ్లతో పాటు చీడపీడల బెడద ఎక్కువగా ఉండడం మూలంగా పంట దిగుబడి గణనీయంగా తగ్గి పెట్టిన పెట్టుబడులు సైతం రావడం లేదంటూ అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలోనే మొక్కజొన్న వైపు అన్నదాతలు చూస్తుండడంతో మొక్కజొన్న సాగు గణనీయంగా పెరిగింది. నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా గతంలో 7-10వేల ఎకరాలలోపు మాత్రమే రబీలో సాగు చేసేవారు. ప్రస్తుతం సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగి నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి నాలుగు డివిజన్ల పరిధిలో 26,590ఎకరాలలో మొక్కజొన్న పంట సాగవుతోందని వ్యవసాయ శాఖ అధికారుల లెక్కల ప్రకారం తేలింది. ఇంత పెద్ద మొత్తంలో విస్తీర్ణం సాగు కావడానికి ప్రధాన కారణం మొక్కజొన్న పంటకు సంబంధించి వేసవి కాలంలో చీడపీడల బెడద తక్కువగా ఉండి తెగుళ్ల రాకపోవడంతోపాటు పంట కోసే దశలో హార్వెస్టింగ్ మిషన్లతో పంటను కోసుకునే వెసులుబాటు ఉండడం మూలంగానే అన్నదాతలందరూ మొక్కజొన్న వైపు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ఇందుకు తోడుగా ప్రస్తుత మార్కెట్‌లో మొక్కజొన్నకు క్వింటాల్‌కు రూ. 2350 ధర పలుకుతుండడంతో పాటు ఒక్కో ఎకరాకు 30 నుంచి 45 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తుండడంతో పెట్టిన పెట్టుబడి పోను ఎకరాకు 20 నుంచి 40వేల రూపాయల మధ్య మిగులుతుండడంతో రైతులందరూ మొక్కజొన్న వైపే చూస్తున్నారు.


ఇంద్రకల్ గ్రామంలో పూత దశలో ఉన్న మొక్కజొన్న పంట

మొక్కజొన్ననే లాభదాయకం




ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఇతర పంటలతో పోల్చితే మొక్కజొన్న పంటనే లాభదాయకం. వాతావరణ మార్పులను తట్టుకోవడంతో పాటు చీడపీడలను సైతం తట్టుకుని గణనీయమైన దిగుబడి ఇచ్చే పరిస్థితులు కనబడుతున్నాయి. ప్రధానంగా మొక్కజొన్నలో అడవి పందుల బెడద తప్ప పెద్దగా ఇబ్బందులు ఏమీ ఉండవు. మొత్తంగా మొక్కజొన్న పంట కొంత వరకు లాభదాయకంగా కనబడుతూ ఉంది. నేను రెండున్నర ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశాను. మరికొద్ది రోజుల్లో పంట కోతకు వస్తుంది.

- బంగారయ్య, సిర్సవాడ

ప్రశాంతంగా
నవోదయ ప్రవేశ పరీక్ష

బిజినేపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరం 9వ, 11వ తరగతుల్లోని ఖాళీ సీట్ల భర్తీకోసం శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ప్రిన్సిపాల్ భాస్కర్ కుమార్ తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించామని, 11వ తరగతి ప్రవేశ పరీక్షకు 3,369 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 2,833 మంది హాజరయ్యారని తెలిపారు. 9వ తరగతి ప్రవేశ పరీక్షకు 1,647 మంది హాజరు కావాల్సి ఉండగా 1,328 మంది హాజరయినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లోని పరీక్ష కేంద్రాలను రెవెన్యూ అధికారులు, విద్యాశాఖ అధికారులు, నవోదయ విద్యాలయం అధికారులు పర్యవేక్షించారని తెలిపారు. పరీక్ష సజావుగా నిర్వహించేందుకు సహకరించిన పోలీసు, వైద్య శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. బిజినేపల్లిలో తహసీల్దారు శ్రీరాములు, కల్వకుర్తిలో వట్టెం జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ భాస్కర్ కుమార్, కొల్లాపూర్‌లో ఆర్డీవో, తహసీల్దార్లు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

భక్తిశ్రద్ధలతో
వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


దేవునితిర్మలాపూర్‌లో శేష వాహనంపై వేంకటేశ్వరుడు

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని దేవునితిర్మలాపూర్ గ్రామంలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం వాసుదేవ హోమం, శేషవాహన సేవ అంగరంగ వైభవంగా కొనసాగాయి. శేష వాహనంపై శ్రీవేంకటేశ్వరున్ని అలంకరించి గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగించారు. భక్తులు అడుగడుగునా స్వామి వారికి హారతులు ఇచ్చి కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా అర్చకులు శేషాచార్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వి.సత్యం తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులు పూర్తి చేయాలి

» అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

గద్వాల న్యూటౌన్, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ తహసీల్దార్లకు ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో అన్ని మండలాల తహసీల్దార్లతో పెండింగ్ ధరణి, మీసేవా కేంద్రాలలో దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కుల, ఆదాయ, ఓబీసీ ధ్రువపత్రాలను ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించారు. కొత్త రేషన్‌కార్డులు పొందిన కుటుంబాల వివరాలను జత చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. మీసేవా కేంద్రాల ద్వారా బర్త్, డెత్ సర్టిఫికేట్లు నిర్ధేశిత కాల పరిమితిలో అందేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. షాదీ ముబారక్, కల్యాణలక్ష్మికి సంబంధించిన పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి పూర్తి చేయాలన్నారు.

పెండింగ్‌లో ఉన్న సీఎం గ్రీవెన్స్ ఫిర్యాదులను, ఎక్స్ సర్వీస్‌మాన్, ఫ్రీడం ఫైటర్‌కు సంబంధించిన ఎన్‌వోసీ త్వరగా పరిశీలించి పూర్తి చేయాలన్నారు. ఈ కార్యాచరణను అన్ని మండలాల తహసీల్దార్లు తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసరావు, ఏవో నరేందర్, డీఎస్‌వో స్వామి కుమార్, జిల్లా సర్వేయర్ రామ్‌చందర్, తహసీల్దార్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

మెగాస్టార్ చిరంజీవి
చేతుల మీదుగా అవార్డు

కల్వకుర్తి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలంలోని తర్నికల్ గ్రామానికి చెందిన కొండ్ల నరేందర్ శనివారం మెగాస్టార్ చిరంజీవి చేతులమీదుగా అవార్డు అందుకున్నాడు. కొన్నేళ్లుగా చిరంజీవి ఐ, బ్లడ్ బ్యాంకులలో పలుమార్లు రక్తం ఇవ్వడంతో పాటు రక్తదానం ప్రాధాన్యతపై నరేందర్ పలువురికి అవగాహన కల్పించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని బ్లడ్‌బ్యాంక్‌లో నరేందర్‌ను బెస్ట్ బ్లడ్ క్యాంప్ ఆర్గనైజర్ మెమెంటో, అవార్డుతో చిరంజీవి సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో టీడీగుట్ట రైల్వే గేట్ సమీపంలో రోడ్డుపై గుర్తు తెలియని మగ వ్యక్తి (40)ని లారీ ఢీకొట్టింది. కోయిలకొండ ఎక్స్‌రోడ్ నుంచి టౌన్‌లోకి వచ్చే సిమెంట్ ట్యాంకర్ లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడుపుతూ రోడ్డుపై వెళ్తున్న వ్యక్తిని ఢీకొట్టాడు. అతని తలపై నుంచి లారీ వెళ్లడంతో తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ వాహనాన్ని నిలపకుండా వెళ్లిపోయాడు. ఆ సమయంలో పెట్రోలింగ్ విధులు నిర్వర్తిస్తున్న వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ శంకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మెరుగైన విద్య అందించాలి

- విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసాచారి

వెల్దండ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందించాలని విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసాచారి సూచించారు. శనివారం డిప్యూటీ అసిస్టెంట్ డైరెక్టర్ దుర్గాప్రసాద్‌తో కలిసి శ్రీనివాసాచారి మోడల్‌స్కూల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 10వ తరగతి, ఇంటర్ విద్యాబోధనపై సంబంధిత ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. రాబోవు వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. సులభతరమైన బోధన, పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో చంద్రుడు, ప్రిన్సిపాల్ శ్రీధర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

యోగా టోర్నీలో పతకాలు సాధించాలి

» జిల్లా యోగా సంఘం అధ్యక్షుడు రాములు



యోగా క్రీడాకారులతో జిల్లా సంఘం అధ్యక్షుడు రాములు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి యోగా పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించాలని జిల్లా యోగా సంఘం అధ్యక్షుడు రాములు అన్నారు. తిరువనంతపురంలో ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్న 49వ జాతీయస్థాయి యోగా పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు తరలివెళ్లారు. శనివారం స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. జిల్లా క్రీడాకారులు యోగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించారని గుర్తుచేశారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి జిల్లాకు పేరు తేవాలని ఆకాక్షించారు. జిల్లా యోగా సంఘం కార్యదర్శి బాలరాజు, సలహాదారులు చెన్నవీరయ్య, సభ్యులు చంద్రశేఖర్, సూర్యప్రకాష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

జిల్లా యోగా క్రీడాకారులు

పురుషుల విభాగంలో..: శ్రీకాంత్, ప్రకాష్, మధు, సాగర్, వెంకటేష్

మహిళల విభాగంలో: బాలమణి, స్వప్న, శ్వేత

పోలీస్ క్రీడాకారులకు కమాండెంట్ అభినందనలు



పోలీస్ క్రీడాకారులను సన్మానిస్తున్న కమాండెంట్

ఎర్రవల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో జరిగిన 3వ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ క్రీడల్లో పాల్గొని పతకాలు సాధించిన ఎర్రవల్లి పదో బెటాలియన్ పోలీస్ క్రీడాకారులకు కమాండెంట్ సాంబయ్య అభినందించారు. పదో బెటాలియన్‌కు సంబంధించి 5 గోల్డ్, 4 సిల్వర్, 7 బ్రాంజ్ మెడల్స్‌ను సాధించిన క్రీడాకారులకు శనివారం పటాలంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్‌లు నరేందర్‌రెడ్డి, శ్రీనివాసులు, ఆర్ఐలు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



బాల్‌రెడ్డి (ఫైల్)

ఊర్కొండ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ఇప్పపహాడ్ గ్రామానికి చెందిన తలసాని బాల్‌రెడ్డి (60) వృత్తిరీత్యా ప్రైవేటు సర్వేయర్‌గా ఉండి జీవనోపాధి పొందుతున్నాడు. రెండు రోజుల క్రితం కల్వకుర్తి ప్రాంతంలో భూమి కొలతలు చేసి స్వగృహం చేరుకుంటున్న సమయంలో గ్రామ శివారు(రాచూర్-ఇప్పపహాడ్ రోడ్డు)లో బైకు అదుపు తప్పి చెట్టుకు బలంగా ఢీకొన్నారు. దాంతో తీవ్ర గాయాలు కాగా కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా శనివారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం చేయించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్సై కృష్ణదేవ పేర్కొన్నారు.

9.60 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యం పట్టుకున్న ఆర్ఐ కాళప్ప

నారాయణపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట సుబాష్‌రోడ్ ప్రాంతంలో అనంతయ్య 20 సంచుల్లో అక్రమంగా నిల్వ చేస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీస్, రెవెన్యూ అధికారులు శనివారం తెల్లవారుజామున పట్టుకున్నారు. రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సివిల్‌సప్లయ్ ఆర్ఐ కాళప్ప, పోలీసులు వెళ్లి ఆటోలో తరలిస్తున్న 9.60 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు. సివిల్‌సప్లయ్ గోదాంలో భద్రపరిచి పంచనామా నిర్వహించి 6ఏ సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు ఆర్ఐ కాళప్ప తెలిపారు.

చెట్టుపై నుంచి కిందపడి గీత కార్మికుడి మృతి

కందనూలు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని నాగనూల్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్(58)తమ కుల వృత్తిలో భాగంగా రోజు మాదిరిగానే కల్లు గీసేందుకు వారి వ్యవసాయ పొలానికి వెళ్లాడు. కల్లు కోసమై ఈత చెట్టు పైకి ఎక్కి కల్లు తీస్తున్న క్రమంలో ఒక్కసారిగా చెట్టుపై నుంచి కింద పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానికుల సహాయంతో శ్రీనివాస్‌గౌడ్‌ను హుటాహుటిన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే శ్రీనివాస్‌గౌడ్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడు శ్రీనివాస్‌గౌడ్‌కు భార్య, ఓ కూతురు, కొడుకు ఉన్నారు. గ్రామంలో అందరితో కలివిడిగా ఉండే శ్రీనివాస్‌గౌడ్, తమ కులవృత్తిలోనే మరణించడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

సైబర్ మోసం.. కేసు నమోదు

ఉప్పునుంతల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) అత్యాశకు పోయి ఉన్న డబ్బులు పోగొట్టుకున్న సంఘటన శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామంలో చోటుచేసుకొంది. ఎస్సై వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉప్పరి శంకరయ్య గత సంవత్సరం డిసెంబర్‌లో తెలిసిన వ్యక్తుల ద్వారా డెక్కన్ ప్లాన్ యాప్ గురించి తెలుసుకున్నాడు. డెక్కన్ ప్లాన్ యాప్ డౌన్లోడ్ చేసుకొని 3లక్షల 20 వేల రూపాయలు పెట్టుబడి పెట్టాడు. కొన్ని రోజులు అప్పుడప్పుడు 5 వేల చొప్పున డబ్బులు వేస్తూ నమ్మించారు. ఈ సంవత్సరం జనవరిలో డబ్బులు వేయడం లేదని వాకబు చేస్తుండగా యాప్ క్లోజ్ అయింది. వెంటనే సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేశాడు. శనివారం శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన్నట్లు ఎస్సై తెలిపాడు.

పేకాట స్థావరంపై దాడి: ఆరుగురిపై కేసు

మాగనూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మాగనూరు సమీపంలో శ్మశాన వాటికలోని రేకులషెడ్‌లో పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్.అశోక్‌బాబు శనివారం తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ నమ్మదగిన వ్యక్తుల సమాచారం మేరకు పోలీస్ సిబ్బందితో వెళ్లి పేకాటరాయుళ్లను పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి నగదు రూ. 2,900, పేకాట ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

క్రీడ లే..



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రధాన స్టేడియం

● సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్‌కు మోక్షం ఎప్పుడో?

» ఏర్పాటైతే అథ్లెట్లకు మెరుగైన శిక్షణకు అవకాశం

» వర్షం పడితే ట్రాక్ జలమయం

» పీయూలో అందుబాటులోకి వచ్చిన అధునాతన ట్రాక్



స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న కేంద్ర కమిటీ సభ్యులు(ఫైల్)

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం క్రీడా హబ్‌గా రూపాంతరం చెందుతోంది. జిల్లా కేంద్రంలోని మరోవైపు స్టేడియంలో అధునాతనమైన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణమై క్రీడాకారులకు గత రెండేళ్ల క్రితం అందుబాటులోకి వచ్చింది. మైదానంలో ఆధునికీకరణ పనులు చేపట్టి వాలీబాల్, ఖోఖో, లాంగ్‌జంప్, హైజంప్, బాస్కెట్‌బాల్ కోర్టులతో పాటు ఆర్చరీ జోన్ ఏర్పాటు చేశారు. అయితే మెయిన్ స్టేడియంలో అనేక క్రీడా సౌకర్యాలు ఉన్నప్పటికీ అథ్లెట్లు సాధన చేసుకునేందుకు సింథటిక్ ట్రాక్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మట్టితో ఏర్పాటు చేసిన ట్రాక్‌పైనే సాధన చేసుకుంటున్నారు. అది కూడా వర్షాకాలంలో జలమయంగా మారుతుంది. జిల్లా కేంద్రంలోని పీయూలో గత ఏడాది అంతర్జాతీయ ప్రమాణాలతో సింథటిక్ ట్రాక్ రూ.10 కోట్ల వ్యయంతో నిర్మించారు. 2024లో సీఎం రేవంత్‌రెడ్డి దీనిని ప్రారంభించారు. అథ్లెటిక్స్‌లో అంతర్జాతీయ, జాతీయ స్థాయికి జిల్లా క్రీడాకారులు ఎదిగారు. ప్రధాన స్టేడియంలో లేకపోవడం అథ్లెట్లను నిరాశకు గురి చేస్తున్నది.



పీయూలో ఏర్పాటు చేసిన సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్

స్టేడియాన్ని పరిశీలించిన కేంద్ర కమిటీ సభ్యులు..

ఖేలో ఇండియా పథకం కింద పలు జిల్లాల్లో అధునాతనమైన సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్‌లు ఏర్పాటవుతున్నాయి. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్, మెదక్ జిల్లాల్లో సింథటిక్ ట్రాక్‌లు ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాకే తలమానికమైన మహబూబ్‌నగర్ జిల్లాలో జిల్లా యువజన క్రీడాశాఖ ఆధ్వర్యంలోని ప్రధాన స్టేడియంలో సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ఏర్పాటుకు గతంలో ప్రణాళికలు రూపొందించారు. ఖేలో ఇండియా పథకం కింద మెయిన్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు కోసం ముందుగా జిల్లా క్రీడా శాఖ ద్వారా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్)కు ప్రతిపాదనలు పంపారు. మెయిన్ స్టేడియంలో 400మీటర్ల 8లైన్ల సింథటిక్ ట్రాక్ ప్రతిపాదనలకు సంబంధించి 2021 అక్టోబర్ 22న ఖేలో ఇండియా కేంద్ర పరిశీలన కమిటీ సభ్యులు పరిశీలించారు. స్టేడియం అంతా తిరిగి సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు సంబంధించి ఫీజిబిలిటీ వివరాలు సేకరించారు. అయితే మెయిన్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు కేవలం ప్రతిపాదనలకే పరిమితమైందనే విమర్శలు ఉన్నాయి. రాష్ట్ర క్రీడా సలహాదారుడు ఏపీ జితేందర్‌రెడ్డి జిల్లా వాసి కావటంతో ట్రాక్ ఈ ఏడాది ప్రారంభం అవతుందని జిల్లా క్రీడాకారులు ఎదురు చూస్తున్నారు.

సింథటిక్ ట్రాక్ క్రీడాకారులకు వరం..

జిల్లా కేంద్రంలోని ప్రధాన స్టేడియంలో సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ఏర్పాటైతే ఔత్సాహిక క్రీడాకారులకు ఎన్నో మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయి. సింథటిక్ ట్రాక్‌లో అంతర్జాతీయ స్థాయిలో సౌకర్యాలు ఉంటాయి.

ట్రాక్ ఏర్పాటు అయితే మెయిన్ స్టేడియానికి గుర్తింపుతో పాటు సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్‌తో జాతీయ స్థాయి పోటీలు జరిగే అవకాశం ఉం టుంది.

స్పోర్ట్స్ అథారిటీకి ప్రతిపాదనలు పంపించాం



ప్రధాన స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు కోసం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణకు ప్రతిపాదనలు పంపించాం. అదే విధంగా మరోసారి శాట్ ద్వారా ఖేలో ఇండియాకు ప్రతిపాదనలు పంపించేలా తగిన చర్యలు తీసుకుంటున్నారు. సింథటిక్ ట్రాక్ వస్తే జిల్లాలో అథ్లెటిక్స్ క్రీడాకారులకు మెరుగైన శిక్షణకు అవకాశం ఉంటుంది. అలాగే ఇక్కడి మైదానంలో అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీలు నిర్వహించుకునేందుకు అవకాశాలుంటాయి. మరోసారి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి ఇందుకు ప్రయత్నిస్తా.

- ఎస్. శ్రీనివాస్, డీవైఎస్‌వో, మహబూబ్‌నగర్

సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయాలి



ప్రధాన స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయాలి. ఇప్పటికే స్టేడియంలో ఎన్నో క్రీడా వసతులు ఉన్నాయి. ముఖ్యంగా అథ్లెట్ల కోసం సింథటిక్ ట్రాక్ వస్తే మెరుగైన శిక్షణకు అవకాశం ఉంటుంది. ఇక్కడ సింథటిక్ ట్రాక్ లేక పోవటంతో చాలా మంది జిల్లా అథ్లెట్లు హైదరాబాద్‌లో ప్రాక్టీస్ చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నత అధికారులు స్పందించి ట్రాక్ ఏర్పాటుకు కృషి చేయాలి.

- జి. శరత్‌చంద్ర, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, మహబూబ్‌నగర్

బలవంతపు వసూళ్లు చేస్తే కేసులు

» ట్రాన్స్‌జెండర్లను హెచ్చరించిన సీఐ టంగుటూరి శ్రీను



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీను, ఎస్ఐ కళ్యాణ్‌కుమార్

గద్వాల క్రైం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వాహనదారులతో బలవంతంగా వసూలు చేస్తే కేసులు నమోదు చేస్తామని గద్వాల సీఐ టంగుటూరి శ్రీను అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీఐ కార్యాలయ ఆవరణలో ఉమ్మడి జిల్లాలోని ట్రాన్స్‌జెండర్లను పిలిపించి వార్నింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గద్వాల జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వాహనాదారుల దగ్గర ట్రాన్స్‌జెండర్స్ భిక్షాటన పేరుతో బలవంతపు వసూళ్లు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. అంతేకాకుండా కొందరు ట్రాన్స్‌జెండర్లు గృహాలు, దుకాణాల ప్రారంభోత్సవ సమయంలో యజమానుల నుంచి ఎక్కువ మొత్తంలో వసూలు చే స్తున్నారని ఆరోపణలు వస్తున్నాయన్నారు. వాహనదారులతో, ఇతర వ్యక్తులతో దౌర్జన్యంగా వసూలు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గద్వాల జిల్లా కేంద్రంలో సంగాల పార్కుతో పాటు శెట్టి ఆత్మకూర్ శివారులో, గద్వాల జిల్లాలోని అలంపూర్, అయిజ, మానవపాడు, ఇతర ప్రాంతాల్లో వాహనదారులతో ట్రాన్స్‌జెండర్లు బలవంతంగా వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. అంతేగాకుండా ఇటీవలే బజాజ్ షోరూం వైపు ఉన్న ఓ దుకాణంలో కొందరు ట్రాన్స్‌జెండర్లు అడిగినంత డబ్బులు ఇవ్వకున్నా ఆ సమయంలో టీవీలను కొందరు ట్రాన్స్‌జెండర్లు పగులకొట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని సీఐ వారిపై మండిపడ్డారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని ట్రాన్స్‌జెండర్ల నాయకులు సీఐ కు హామీ ఇచ్చారు. బలవంతంగా, కర్కశకంగా ఇతరుల నుంచి డ బ్బులు వసూలు చేస్తున్న ట్రాన్స్‌జెండర్లపై కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్, ట్రాన్స్‌జెండర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పల్లవి, ప్రీతితో పాటు దాదాపు 60 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు.

నవీన్‌కుమార్ మృతిపై విచారణ

● ట్రాన్స్‌జెండర్ పల్లవిని విచారించిన సీఐ

● నా భర్తను నేనెందుకు చంపుతానంటూ ఆవేదన

గద్వాల క్రైం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నవీన్‌కుమార్ మృతి పట్ల పలు అనుమానాలు ఉండటంతో శనివారం సీఐ టంగుటూరి శ్రీను ఆధ్వర్యంలో టాన్స్‌జెండర్ పల్లవి అలియాస్ రవితో పాటు ఆమె తమ్ముడు నరేశ్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. గత రెండు రోజుల క్రితం చింతలపేటకు చెందిన నెమలికంటి నవీన్‌కుమార్ పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సంఘటనలో అనుమానితులుగా ఉన్న ట్రాన్స్‌జెండర్ పల్లవి, ఆమె తమ్ముడిని సీఐ ఆధ్వర్యంలో పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ అదుపులోకి తీసుకొని శనివారం విచారించినట్లు తెలుస్తున్నది. అయితే నవీన్‌కుమార్ మృతిపై మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించారు. అయితే నవీన్ పురుగులమందు తాగిన క్రమంలో ట్రాన్స్‌జెండర్ పల్లవితో పాటు ఆమె తమ్ముడిపై పలు అనుమానాలు ఉన్నట్లు మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించడంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. కాగా, మృతుడి ఒంటిపై గాయాలు ఉండటం, కడుపు నొప్పి ఉంటే ఎందుకు పురుగులమందు తాగుతాడనే అనుమానాలు ఉన్నట్లు తెలుస్తున్నది. అయితే మృతుడికి పురుగులమందును బలవంతంగా వారే తాగేలా చేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించినట్లు తెలిసింది. ఇదంతా అవాస్తమని, నవీన్‌కుమార్‌ను గత 9 నెలల క్రితం తాను వివాహం చేసుకున్నట్లు ట్రాన్స్‌జెండర్ పల్లవి వివరణ ఇవ్వడంతో పాటు అందుకు సంబంధించి ఫొటోలు, వీడియోలను పోలీసులకు అప్పగించినట్లు పోలీస్ వర్గాల ద్వారా తెలిసింది. అంతేగాక తన పెళ్లి విషయం తెలిసి కుటుంబ సభ్యులు నవీన్‌కుమార్‌కు ఇంకో పెళ్లి చేయాలని చూశారని.. అయినా తన నుంచి ఎలాంటి ఇబ్బంది కల్గించలేదని పోలీసులకు వివరించినట్లు సమాచారం. ట్రాన్స్‌జెండర్‌తో పెళ్లి అయిన విషయం జీర్ణించుకోలేక నవీన్ కుటుంబ సభ్యులు అభ్యంతరం తెలుపడంతోనే పురుగులమందు తాగినట్లు పల్లవి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తున్నది. పురుగులమందు తాగిన వెంటనే తన తమ్ముడు నరేశ్‌తో నవీన్‌కుమార్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులకు తెలిపింది. ఏది ఏమైనా నా భర్తను నేను ఎందుకు చంపుకుంటానంటూ ట్రాన్స్‌జెండర్ పోలీసుల విచారణలో వెల్లడించినట్లు తెలుస్తున్నది. ఇదిలా ఉండగా, పురుగులమందు తాగిన తర్వాత ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు నవీన్‌కుమార్‌తో మాట్లాడగా తను కడుపునొప్పి కారణంగానే పురుగులమందు తాగినట్లు వెల్లడించినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా ఈ మరణంపై పూర్తి స్థాయిలో విచారించి నిజాలు వెల్లడిస్తామని సీఐ టంగుటూరి శ్రీను తెలిపారు.

కలెక్టరేట్‌లో పాముల కలకలం



కలెక్టరేట్‌లో పామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ వంశీ

కందనూలు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ప్రాంగణంలో శనివారం ఉదయం రస్సెల్స్ వైపర్(రక్తపింజర)పాములు కలకలం రేపాయి. భవన ప్రాంగణంలో పచ్చదనం కోసం ఏర్పాటు చేసిన మొక్కల మధ్య రెండు పాములను గుర్తించి కలెక్టర్ కార్యాలయ సిబ్బంది స్నేక్‌క్యాచర్ తెప్ప వంశీకి సమాచారమిచ్చారు. స్టిక్‌తో అక్కడికి చేరుకుని పాములు పట్టుకున్నాడు. అప్పటి వరకు అందరూ కొండచిలువలుగా భావించిన అవి రస్సెల్స్ వైపర్ అనే జాతికి చెందిన విషపూరితమైన పాములుగా స్నేక్ క్యాచర్ తెలిపారు. అనంతరం పట్టుకున్న పాములను ప్లాస్టిక్ డబ్బాలలో బంధించి సురక్షితంగా బుద్దారం గండి అడవిలో వదిలిపెట్టారు. ఈ సందర్భంగా స్నేక్ క్యాచర్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రస్సెల్స్ వైపర్ జాతికి చెందిన పాములు మనుగడ సాధిస్తున్నాయన్నారు. ఇవి అనేక ప్రాంతాల్లో నిత్యం కన్పిస్తున్నట్లు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పట్టుకున్న రెండు పాములు మగ, ఆడదిగా ఆయన వివరించారు.

మేటింగ్ సమయంలో ఈ పాములు కలిసి ఉంటాయని వివరించాడు. మరొకటి ఇదే జాతికి చెందిన పామును హౌసింగ్‌బోర్డు కాలనీ వద్ద గల రవితేజ పాఠశాల వెనక భాగంలో శరత్‌బాబు అనే వ్యక్తి ఇంట్లో కూడా పట్టుకున్నట్లు వంశీ తెలిపాడు. నాగర్‌కర్నూల్ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఇలాంటి పాములు కన్పిస్తే వాటికి హాని కలిగించకుండా తమకు సమాచారమందిస్తే వాటిని సురక్షితంగా పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టడం జరుగుతుందని వంశీ వివరించారు.

● వంశీని అభినందించిన కలెక్టర్

కలెక్టర్ కార్యాలయం ఆవరణలో రెండు విషపూరితమైన పాములను పట్టుకుని సురక్షితంగా అడవిలో వదిలిపెట్టిన తెప్ప వంశీని కలెక్టర్ బదావత్ సంతోష్ తన ఛాంబర్‌లో అభినందించారు. ఆయనతో పాటు అమ్రాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న సుమన్ కూడా స్నేక్ క్యాచర్‌గా అనేక పాములు పట్టుకున్నట్లు వంశీ తెలిపారు. మహమ్మద్, మాసూమ్ తదితరులు పాల్గొన్నారు.

పౌల్ట్రీఫాంను పరిశీలించిన వెటర్నరీ అధికారులు



మున్ననూరులోని కోళ్ల ఫాంను పరిశీలిస్తున్న వెటర్నరీ అధికారులు

మిడ్జిల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని మున్ననూర్ గ్రామ శివారులోని కోళ్లఫాంను శనివారం వెటర్నరి వైద్యుడు శివరాజ్ పరిశీలించారు. పక్షులలో వస్తున్న ఏవియన్ ఇన్‌ఫ్లూఎంజా వ్యాధిపై కోళ్ల పరిశ్రమల యజమానులకు అవగాహన కల్పించినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం పక్షుల్లో వచ్చే వ్యాధులపట్ల కోళ్ల పెంపకం దారులు అప్రమత్తంగా ఉండాలని వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఆయన వెంట వెటర్నరీ సిబ్బంది తదితరులున్నారు.

ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్న గ్రామస్థులు

తాడూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎట్టిధార్‌పల్లి గ్రామానికి చెందిన శేఖర్‌గౌడ్ శనివారం ఎలాంటి అనుమతులు లేకుండా దుందుభీ నదిలో నుంచి ఇసుకను ట్రాక్టర్‌లో తీసుకెళ్తుండటంతో గమనించిన గో విందాయపల్లి గ్రామ పెద్దలు రహదారిపై అడ్డుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను ఎక్కడికి తరలిస్తున్నావంటూ ప్రశ్నించగా పొంత న లేని సమాధానాలు చెప్పాడు. దీంతో పోలీసులు వచ్చే దాకా వాహనాన్ని కదలనిచ్చేది లేదంటూ నిరసన తెలిపారు. కొంత సేపటికి పోలీసులు వచ్చి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

వరి సాగును పరిశీలించిన శాస్త్రవేత్తలు



పచ్చర్లలో వరి సాగును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

రాజోలి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలంలోని పచ్చర్ల గ్రామంలో రైతులు సాగు చేస్తున్న వరి సాగు పంటలను పరిశీలించేందుకు శనివారం శాస్త్రవేత్తల బృందం పరిశీలించారు. గత సీజనల్‌లో పచ్చర్ల గ్రామం శివారులో రైతులు సాగు చేసిన ఆర్ఎన్ఆర్ రకం వరి విత్తనాలతో సాగు చేసిన పంటలో సమస్యలు తలెత్తాయని రైతులు మండల వ్యవసాయ శాఖ అధికారి సురేఖకు ఫిర్యదు చేశారు. అయిజ, వెంకటాపురం షాపుల్లో తీసుకున్న వరి విత్తనాలను నాటితే నారులో ఈనెలు వస్తున్నాయని రైతులు చెప్పడంతో ఆమె పంటలను పరిశీలించి ఉన్నతాధికారులకు విన్నవించారు. దీంతో శనివారం హైదరాబాద్‌లో గల ఐఆర్ఆర్ఐ ప్రిన్సిపాల్ ప్లాంట్ బ్రీడింగ్ శాస్త్రవేత్త ఎల్. కృష్ణ, ప్లాంట్ పాథాలజీ శాస్త్రవేత్త డాక్టర్ టి. కిరన్ బాబు, పాలెం ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ శంకర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియా నాయక్ కలిసి పంటలను పరిశీలించారు. నీరులో ఎన్ని పిలకలు వచ్చాయి, పంట పెరుగుతున్న చోట వాతావరణ ఉష్ణోగ్రతలు ఎలా ఉన్నాయి.. పంటలకు అందించే నీటి స్వభావం, భూమి స్వభావం గురించి వారు అడిగి తెలుసుకున్నారు. ఉష్ణోగ్రత వివరాలను తమ ల్యాబ్‌కు పంపాలని వారు కోరారు. పంటకు ఎలాంటి మందులు వాడారు, ఏ దశలో వాడారు.. మందుల వివరాలను తెలుసుకున్న అధికారులు వరి నారను, పంటకు సంబంధించిన నమూనాలను సేకరించి పరిశీలించారు. ఏవో సురేఖ, క్లస్టర్ ఇన్‌చార్జి ఏఈవో ఇబ్రహీం పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

పశు పెంపకంతో లాభాలు

● పశువైద్య అధికారి డాక్టర్ సాయివరుణ్



ఊట్కూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ వృత్తిపై జీవించె వారు పశువులను పెంచుకోవడం లాభసాటిగా ఉంటుందని మండల పశువైద్య అధికారి డాక్టర్ సాయివరుణ్ అన్నారు. శనివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు.

పశువుల పెంపకానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

వ్యవసాయంపై ఆధారపడిన వారు గేదెలు, ఆవులను పెంచుకోవడం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయి. వాటి వ్యర్థాలతో సేంద్రియ వ్యవసాయం చేయొచ్చు.

పశువుల రక్షణకు ఎలాంటి పథకాలు ఉన్నాయి?

ప్రస్తుతం నేషనల్ లైవ్ స్టాక్ స్కీం ఉంది. ఈ పథకం ద్వారా పశువులను పెంచుకుంటే వాటికి ఆరోగ్యం, సంరక్షణతో పాటు బీమా సౌకర్యం కల్పించడం జరుగుతుంది.

మండలంలో ఎన్ని ఆసుపత్రులు, సబ్ సెంటర్లు ఉన్నాయి?

ఊట్కూర్, చిన్నపొర్లలో పశు వైద్యశాలలు ఉన్నాయి. వాటికింద పులిమామిడి, బిజ్వార్, ఎడవెల్లి గ్రామాల్లో సబ్ సెంటర్లు పని చేస్తున్నాయి.

పశు వైద్యశాలలో సరిపడా వైద్య సిబ్బంది ఉన్నారా?

మండలంలో ఇద్దరు డాక్టర్లతో పాటు, ఇద్దరు వీఏవేలు ఉన్నారు. సిబ్బంది అవసరం ఉంది.

విద్యుదాఘాతంతో చనిపోయిన పశువుల నష్టపరిహారం కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

పశువులు చనిపోయిన వెంటనే సమాచారం ఇస్తే పంచనామాతో పాటు, పోస్టుమార్టం నిర్వహించి వాటి రిపోర్టును ఉన్నతాధికారులకు అందిస్తాం. అనంతరం విద్యుత్ శాఖ ద్వారా నష్టపరిహారం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

పేట యార్డులో ధాన్యం క్రయ విక్రయాలు

నారాయణపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు శనివారం ధాన్యం విక్రయానికి వచ్చింది. ధాన్యం ధరలు ఈ విధంగా ఉన్నాయి.

ధాన్యం	క్వింటాల్	గరిష్ట	కనిష్ట
		(రూపాయలలో)	
వేరుశనగ	558.30	6,049	3,601
అలసందలు	2.94	6,555	6,555
ఎర్ర కందులు	244.51	7,650	6,296
తెల్ల కందులు	56.35	7,809	6,916

న్యూస్ బాక్స్

రేపు మరికల్‌కు ఎంపీ, ఎమ్మెల్యే రాక

మరికల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠాపనకు, ఐదేళ్ల కోసారి జరిగే బీరప్ప బండారు ఉత్సవాలకు సోమవారం పాలమూరు ఎంపీ డీకే.అరుణ, పేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి హాజరు కానున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు వేణు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరన్న శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. కార్యక్రమాలకు భక్తులు, మాదాసీ కుర్వస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఎమ్మెల్యేకు త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రతి అందజేత

మక్తల్‌రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): భీష్మ ఏకాదశి సందర్భంగా మక్తల్ పట్టణంలో శనివారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రతులను అందించారు. ఎర్రవల్లి కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు భీష్మ ఏకాదశి విశిష్టతను వివరించారు. సభ్యులు సిమెంట్ వెంకటేష్, నంద కిశోర్ ఉన్నారు.

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు భూమిపూజ

దామరగిద్ద, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మల్‌రెడ్డిపల్లి గ్రామంలో ఎస్‌డీఎఫ్ ప్రత్యేక నిధులు రూ.మూడు లక్షలతో 50 మీటర్ల పొడువు గల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు నారాయణపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివారెడ్డి, వైస్ చైర్మన్ కే.హనుమంతు, పేట ఎమ్మెల్యే పీఏ చిట్టెం మాధవరెడ్డి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఓబీసీ మండల అధ్యక్షుడు శివకుమార్, బాల్‌రాజ్, అశోక్‌గౌడ్, సాయిలు, ఎంపీటీసీ మాజీ సభ్యులు పెరమళ్ల, రామకృష్ణ, లాలప్ప తదితరులున్నారు.

4న జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపికలు

నారాయణపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మినీ స్టేడియంలో ఈనెల 14న ఉదయం తొమ్మిది గంటలకు 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ జిల్లా స్థాయి ఎంపికలు జరుగుతాయని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి రమణ తెలిపారు. అండర్-14,16,20 విభాగాల్లో వివిధ అంశాల్లో ఎంపికలు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు బోనఫైడ్ జిరాక్స్ కాపీతో హాజరు కావాలన్నారు.

నిలువ నీడలేదు.. తాగ నీరులేదు

» బస్‌స్టాప్‌ల వద్ద షెల్టర్లు లేక ప్రయాణికుల పాట్లు
» ఇతర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులకు తప్పని తిప్పలు
» వేసవి సమీపిస్తున్నా బస్‌స్టాప్‌ల వద్ద నీటి వసతి లేని పరిస్థితి



కోస్గి మండలం కడెంపల్లి స్టేజీ వద్ద బస్సు కోసం వేచి చూస్తున్న విద్యార్థినులు, మహిళలు



గుండుమాల్ మండలం భక్తిమళ్ల స్టేజీ వద్ద బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికులు

కోస్గి రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ అవసరాల నిమిత్తం సొంత ప్రాంతాల నుంచి ఇతర ప్రాంతాలకు బస్సుల్లో, ఇతర వాహనాల్లో ప్రతీ నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. పాఠశాల, కళాశాల విద్యార్థులు విద్యాభ్యాసం కోసం ఇతర ప్రాంతాలకు బస్సుల్లో వెళ్లి సాయంత్రంలోపు తిరిగి వారి స్వగ్రామానికి చేరుకుంటారు. కోస్గి మండల వ్యాప్తంగా కొన్ని గ్రామాలు ప్రధాన రహదారులకు రెండు లేదా మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. ఈ గ్రామాల ప్రజలు, విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే తమ గ్రామ స్టేజీల వద్దకు రావాల్సిందే. ఆర్టీసీ బస్సుల కోసం, ఇతర వాహనాల కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సిందే. ప్రయాణికులు నిల్చోడానికి నీడ ఉండదు. కూర్చోడానికి వీలుండదు. దప్పిక వేస్తే తాగడానికి నీరు లేని పరిస్థితి ఎన్నో బస్‌స్టాప్‌ల వద్ద నిత్యం మనకు కన్పిస్తుంటుంది. దాదాపు రెండు కిలోమీటర్ల దూరం నడిచి బస్ స్టేజీలకు చేరుకున్న వృద్ధులు, దివ్యాంగులు కూర్చోవటానికి వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కోస్గి మండలంలో మహబూబ్‌నగర్-చించోళి రహదారి వెంట మల్‌రెడ్డిపల్లి, సంపల్లి, నాచారం, చంద్రవంచ గ్రామాలు, కోస్గి-గుండుమాల్ మార్గంలో కడంపల్లి, బోగారం, భక్తిమళ్ల, గుండుమాల్ గ్రామాలు, కోస్గి-దౌల్తాబాద్ మార్గంలో ముంగిమళ్ళ, ముశ్రీఫా, బొల్వోనిపల్లి, కోస్గి-పల్లెర్ల మార్గంలో చెన్నారం, బిజ్జారం, మీర్జాపూర్, కోస్గి-పోలేపల్లి మార్గంలో తోగాపూర్, ఈజీపూర్ గ్రామాల బస్‌స్టాప్‌ల వద్ద షెల్టర్లు, నీటి వసతుల్లేక ప్రయాణికులు పాట్లు పడుతున్నారు.

బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలి..



మాది గుండుమాల్ మండలంలోని భక్తిమళ్ల గ్రామం. మా గ్రామం నుంచి బస్‌స్టేజీ వరకు దాదాపు ఒక కిలోమీటరు నడవాలి. బస్సు కోసం గంటల తరబడి వేచి చూడాలి. బస్‌స్టేజీ వద్ద కూర్చోవడానికి ఏమీ ఉండవు. తాగడానికి నీరు కూడా అందుబాటులో లేదు. చాలా ఇబ్బందులకు గురవుతున్నాం. బస్ షెల్టర్ ఏర్పాటుచేస్తే సౌకర్యవంతంగా ఉంటుంది.

- ఒగ్గని చంద్రప్ప, ప్రయాణికుడు, భక్తిమళ్ల

ఢిల్లీ విజయంపై బీజేపీ సంబురాలు



పేట పట్టణంలో సంబురాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

నారాయణపేటటౌన్/నర్వ/కోస్గి రూరల్/కొత్తపల్లి/మక్తల్ రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ విజయంపై ఆ పార్టీ నాయకులు శనివారం పేట జిల్లా కేంద్రంలో విజయోత్సవ సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు పగడాకుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఢిల్లీలో గత మూడు ఎన్నికల్లో ఒక్క సీటు కూడా కాంగ్రెస్ గెలుచుకోలేకపోయిందని, రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఇదే గతి పడుతుందని అన్నారు. పట్టణ అధ్యక్షుడు పోషల్ వినోద్ మాట్లాడుతూ అరవింద్ కేజ్రీవాల్‌ను ఓడించిన ప్రవేష్‌వర్మకు, ఈ విజయానికి కారకులైన ఢిల్లీ ఓటర్లకు, పార్టీ కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురామయ్యగౌడ్, ఉపాధ్యక్షులు సత్యయాదవ్, తిరుపతిరెడ్డి, వెంకటయ్య, కృష్ణ, నందు నామాజీ, టౌన్ బిల్డర్ వెంకట్రాములు తదితరులున్నారు.

అదేవిధంగా నర్వలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బీజేపీ మండల అధ్యక్షుడు అజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు బాణసంచా పేల్చి సంబురాలు జరుపుకున్నారు. నాయకులు నరేందర్‌రెడ్డి, మిస్త్రీ హన్మంతు, కుర్వ సత్యం, ఆయా గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

కోస్గిలోని శివాజీ చౌరస్తాలో కోస్గి ఉమ్మడి మండల బీజేపీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. నాయకులు, కార్యకర్తలు టపాసులు కాల్చి మిఠాయిలు పంచి పెట్టారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పాలెం ప్రశాంత్‌కుమార్, శ్రీకాంత్, సీబీ.వెంకటేష్ తదితరులున్నారు.

కొత్తపల్లి మండలం భూనీడు గ్రామంలో బీజేపీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. చౌరస్తాలో బాణాసంచా కాల్చి స్వీట్లు పంచి పెట్టారు. పార్టీ మండల అధ్యక్షుడు బొబ్బిలి సుధాకర్‌రెడ్డి, కే.నారాయణరెడ్డి, రవీందర్‌సింగ్, కుమ్మరి వెంకట్, కమ్మరి శివకుమార్, నవకాంత్‌రెడ్డి, మంగలి నాగరాజు తదితరులు ఉన్నారు.



మక్తల్‌లో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర నాయకుడు కొండయ్య

మక్తల్ పట్టణంలో శనివారం బీజేపీ నాయకులు బాణాసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు కొండయ్య మాట్లాడుతూ 25 ఏళ్ల తరువాత తిరిగి దేశ రాజధానిలో బీజేపీ అధికారంలోకి రావడం చాలా సంతోషాన్నిచ్చిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కర్నేస్వామి, బాల్‌చేడ్ మల్లికార్జున్, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చిట్యాల లక్ష్మణ్, బలరాంరెడ్డి, కల్లూరి నాగప్ప, లింగం, రాంమాధవ్ తదితరులున్నారు.

ధ్వంసమైన పెద్దపొర్ల - గాడుదుల వాగు



గుంతలుగా మారిన రోడ్డును చూపిస్తున్న రైతులు

» వర్షాలు పడితే నడవలేని దుస్థితిలో ఊట్కూర్ రహదారి
» ఎద్దులబండ్లు కూడా వెళ్లలేని స్థితిలో ఇబ్బంది పడుతున్న రైతులు
» రాకపోకలు నిలిచిపోవడంతో తగ్గిన రోడ్డు విస్తీర్ణం
» ఆరేళ్లుగా ఇబ్బంది పడుతున్న అన్నదాతలు

ఊట్కూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పంటలు పండించి దేశానికే అన్నం పెడుతున్న రైతులకు ఏదో రూపంలో సమస్యలు నిత్యం వెంటాడుతూనే ఉంటాయి అనడానికి ఊట్కూర్ మండలం పెద్దపొర్ల గ్రామం నుంచి గాడుదుల వాగు రోడ్డుకు ఇరువైపుల పొలాలు ఉన్న అన్నదాతల దుస్థితి చూస్తే అర్థం అవుతుంది. పెద్దపొర్ల గ్రామానికి చెందిన 40 వ్యవసాయ కుటుంబాలకు పెద్దపొర్ల నుంచి గాడుదుల వాగు, ఆ వైపు నుంచి ఊట్కూర్‌కు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా దాదాపు 200 వందల ఎకరాల భూమి ఉన్నది. ఈ భూమినే నమ్ముకుని ఏళ్ల తరబడి జీవనం కొనసాగిస్తున్న రైతులకు గత ఆరేళ్ల క్రితం రోడ్డు ధ్వంసం కావడంతో ఇబ్బందులు మొదలయ్యాయి. ముందు చౌడు భూమి కావడంతో వర్షాకాలంలో పొలాలకు నడిచి పోవాలన్నా, ఎద్దులబండ్లపై పోవాలన్నా సాధ్యం కావడం లేదు. దాదాపు మూడు ఫీట్ల రోడ్డు కాస్తా గుంతలు, బురదమయంగా మారడంతో పక్క రైతుల పొలాల మీదుగా వెళ్లగా వారి నుంచి వ్యతిరేకత వస్తోంది. దీంతో తమ పొలాలకు ఎలా పోవాలో అర్థం కాని అయోమయంలో ఆ గ్రామ రైతులు ఉన్నారు. ఒకప్పుడు రోడ్డు వ్యవస్థ లేని కాలంలో మండల కేంద్రమైన ఊట్కూర్‌కు చుట్టుపక్కల గ్రామాల నుంచి వ్యవసాయ పనులు, పీర్ల పండుగ, సంతకు వెళ్లడానికి కాలినడక, ఎద్దులబండ్లే ఆధారం అయ్యింది. పెద్దపొర్ల నుంచి ఊట్కూర్ నాలుగు కిలోమీటర్ల దూరం కావడంతో పెద్దపొర్ల, చిన్నపొర్ల, ఎడవెల్లి గ్రామాల ప్రజలు పోవడానికి ప్రధాన రోడ్డుగా గాడుదుల వాగును ఎంచుకున్నారు. బీటీ రోడ్ల వ్యవస్థ వచ్చిన తర్వాత ఈ రోడ్డు ద్వారా ఊట్కూర్‌కు రాకపోకలు చేసే వారి సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. దీంతో పొలాలకు వెళ్లే రైతులు మాత్రమే రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఊట్కూర్‌కు పోవడానికి చాలా తక్కువ దూరంలో ఉన్నా రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో గత ఆరు సంవత్సరాల నుంచి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతూ వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. ఈ వేసవి కాలంలోనైనా రోడ్డుకు మొరం వేసి మరమ్మత్తు చేయాలని రైతులు కోరుతున్నారు. మెటల్ రోడ్డు వేస్తే పొలాలకు వెళ్లే రైతులతో పాటు ఊట్కూర్‌కు వెళ్లడానికి చాలా అనువుగా ఉంటుందని గ్రామస్థులు పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి మెటల్ రోడ్డు వేయించాలని వారు కోరుతున్నారు.

ఎంనోన్‌పల్లిలో జోరుగా మట్టి దందా

» పట్టించుకోని అధికారులు

ధన్వాడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ధన్వాడ మండలం ఎంనోన్‌పల్లి గుట్ట నుంచి జోరుగా మట్టి దందా కొనసాగుతున్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. అధికార పార్టీకి చెందిన మండల ముఖ్య నాయకుడు గుట్ట నుంచి మొరంను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మొరంను తరలిస్తు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. అక్రమంగా మొరం తరలిస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు టిప్పర్లను పట్టుకొని వదిలేస్తున్నట్లు సమాచారం. మొరం తరలింపు విషయంలో అధికారులు సైతం పట్టించుకోకపోవడంపై వారిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని గ్రామస్థులు పేర్కొన్నారు.

మంత్రి ఉత్తమ్‌ను కలిసిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్‌రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల శాఖ, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిశారు. సోదరుడు వాకిటి శేషగిరితో కలిసి మంత్రిని కలిసిన ఎమ్మెల్యే నియోజకవర్గ పరిధిలో నీటి పారుదల, పౌరసరఫరాల శాఖకు సంబంధించిన పెండింగ్ విషయాలపై చర్చించారు. సంగంబండ ప్రాజెక్టు పరిధిలో దశాబ్దాల నుంచి పెండింగ్‌లో ఉన్న బండరాయి సమస్యను అడిగి వెంటనే పరిష్కరించిన మంత్రి ఉత్తమ్ మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు సైతం చేపట్టాలని కోరారు.

నులి పురుగుల నివారణపై అవగాహన

కోస్గి రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం నులిపురుగుల నివారణపై వైద్యాధికారులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గుండుమాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి కిష్టమ్మ సిబ్బందికి, అంగన్‌వాడీ కార్యకర్తలకు నులిపురుగు నివారణపై పలు సూచనలు చేశారు. పిల్లల్లో వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమన్నారు. నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్, ఎంఈవో శంకర్‌నాయక్, మణిమాల, రవికుమార్, శ్రీనివాస్ తదితరులున్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు

ధన్వాడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని షీ టీమ్ పోలీసులు బాల్‌రాజు, చెన్నయ్యలు అన్నారు. ధన్వాడ డిగ్రీ కళాశాలలో శనివారం షీ టీమ్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, గంజాయి, ట్రాఫిక్ చట్టాలు, సెల్‌ఫోన్ వినియోగం వల్ల ఏర్పడే అనర్థాల గురించి పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో దేవి, ప్రమీల పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ఊట్కూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిజ్వార్ గ్రామానికి చెందిన నాగార్జునగౌడ్‌కు సీఎంఆర్‌ఎఫ్ నుంచి వచ్చిన రూ.60 వేల చెక్కును శనివారం మక్తల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మక్తల్ మాజీ ఉపసర్పంచ్ కట్టసురేష్, నాయకులు రాయికోడ్ ఆనంద్, నాగేష్‌గౌడ్‌లు అందించారు. గుండెపోటు వచ్చిన బాధితుడు చికిత్స అనంతరం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నాడని వారు తెలిపారు.

'రైతు దీక్ష'కు తరలి రావాలి

» కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



నిడ్జింత గ్రామంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పట్నం నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి/కోస్గి/ ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కోస్గి పట్టణంలో ఈ నెల పదో తేదీన నిర్వహించనున్న రైతు దీక్షకు రైతులు అధిక సంఖ్యలో తరలిరావాలని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కొత్తపల్లి మండలంలోని నిడ్జింత గ్రామంలో ఆయన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు, మహిళలకు రూ.2,500 అమలు చేయలేదని గుర్తు చేశారు. సోమవారం నిర్వహించనున్న రైతు దీక్షకు కేటీఆర్ రానున్నారని, ప్రతీ గ్రామం నుంచి 200 మంది దాకా రైతులు తరలిరావాలని కోరారు. నాయకులు సలీం, వీరారెడ్డి, పార్టీ కొత్తపల్లి మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, రాంరెడ్డి, బి.నరేందర్‌రెడ్డి ఉన్నారు.

అదేవిధంగా, కోస్గిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ, వెంకట్‌నర్సిములు, సాయప్ప, సలీం ఉన్నారు.

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పరిశీలన



జాజాపూర్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం దత్తురావు

నారాయణపేటరూరల్/ఊట్కూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పేట మండల పరిధిలోని జాజాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజనాన్ని గ్రౌండ్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ హెచ్‌ఎం దత్తురావు ఆకస్మికంగా పరిశీలించారు. ప్రతీరోజు మెనూ ప్రకారం భోజనం ఉండాలని, పిల్లలకు రుచికరమైన ఆకుకూరలు, కూరగాయలు చేయాలన్నారు. వంటపాత్రలు శుభ్రంగా ఉంచాలన్నారు. హెచ్‌ఎం భారతి, క్లస్టర్ సీఆర్పీ పవిత్ర, భానుప్రకాశ్ ఉన్నారు.

అదేవిధంగా ఊట్కూర్ మండలంలోని మల్లెపల్లి, చిన్నపొర్ల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలతో పాటు, మల్లెపల్లి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల, చిన్నపొర్ల ఉర్దూ మీడియం, తెలుగు మీడియం ఉన్నత పాఠశాలలను శనివారం ఎంపీడీవో ధనుంజయ్‌గౌడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతుల వారీగా బోధనలను పరిశీలించడంతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుపట్టికలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. మల్లెపల్లి హెచ్‌ఎం మోహినుద్దీన్, చిన్నపొర్ల ఇన్‌చార్జి హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఉన్నారు.



మల్లెపల్లి పాఠశాలలో విద్యార్థులకు వండిన పప్పును పరిశీలిస్తున్న ఎంపీడీవో ధనుంజయ్‌గౌడ్

రేపటి ధర్నాను విజయవంతం చేయాలి

» రౌండ్‌టేబుల్ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి

నారాయణపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ ఈనెల 10న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించతలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీమా రంగంలో వందశాతం విదేశీ పెట్టుబడులను అనుమతివ్వడం తగదన్నారు. కార్మికుల సంక్షేమాన్ని కేంద్ర బడ్జెట్‌లో గాలికి వదిలారని ఆరోపించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, అంజిలయ్యగౌడ్, బాల్‌రామ్, జోషి, బాలమణి, కాశీనాథ్, రామకృష్ణ తదితరులున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఆచార్యులు, మాతాజీలు

నారాయణపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో 2007-08 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. నాటి స్నేహితులు ఒక్కచోట కలుసుకొని జ్ఞాపకాలు, మధురస్మృతులు నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఆచార్యులను సత్కరించారు. పాఠశాల అధ్యక్షుడు బాల్‌రాజు, దూస సీతారాములు, సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, దత్తుచౌదరి, రాములప్ప, పద ట్మమ్మ, సాయన్న, విజయలక్ష్మి, జయమ్మ, విజయలక్ష్మి, దత్తప్ప, శారద తదితరులున్నారు.

విగ్రహాలకు ప్రత్యేక పూజలు

మరికల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సరస్వతీ దేవి ఆలయం ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని సరస్వతీ సమేత లక్ష్మీ, గణపతి ప్రతిష్ఠాపన విగ్రహాలకు మొదటి రోజు శనివారం వేదమంత్రోచ్చరణాలతో పురోహితులు అభిషేకం నిర్వహించారు. శనివారం మరికల్‌లో నూతనంగా నిర్మించిన సరస్వతీ ఆలయంలో శాంతి మంత్రం, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశనం తదితర విశేష పూజలు చేశారు. ఉత్సవాలు మూడురోజుల పాటు కొనసాగుతాయని, సోమవారం ఉదయం 11:24 గంటలకు యంత్రస్థాపన, విగ్రహస్థాపన, ప్రాణ ప్రతిష్ఠ జరుగుతుందని, మండలం, గ్రామం నుంచి ప్రతీ ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

మండల పరిధిలోని ఎక్లాస్‌పూర్ గ్రామ స్టేజీ వద్ద వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయ ప్రాంగణంలో శనివారం భక్తులు సంతాన పాశుపతహోమం, ఆంజనేయ మాన్యసూక్త హోమం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఈనెల 12న పార్వతీ పరమేశ్వర కల్యాణం నిర్వహించనున్నామని ఆలయ ధర్మకర్త నరసింహ తెలిపారు.

ఘనంగా శివస్వాముల మహా పడిపూజ



ఊట్కూర్‌లో మహా శివుడికి క్షీరాభిషేకం చేస్తున్న గురుస్వాములు

ఊట్కూర్/ధన్వాడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఊట్కూర్ మండల కేంద్రంలో శనివారం శివస్వాముల ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగాల మహా శివ పూజ నిర్వహించారు. గ్రామంలోని దేవీనగర్‌లో గల వీరభద్రేశ్వర ఆలయ ప్రాంగణం వద్ద జరిగిన కార్యక్రమంలో వడ్డెమాన్ ప్రభులింగం గురుస్వామి ఆధ్వర్యంలో మహాపూజను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఉదయం కలశ ఊరేగింపు, రాత్రి భజన కార్యక్రమం చేపట్టారు. గురుస్వాములు, శివస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

అదేవిధంగా, ధన్వాడ మండల కేంద్రంలోని లక్ష్మీవాడ కోచ్చ గుడి ఆవరణలో శనివారం శివస్వాములు మహా పడిపూజ నిర్వహించారు. ధన్వాడతో పాటు, మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.